క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బేల: మండల కేంద్రంతో పాటు చప్రాల, సాంగిడి, సిర్సన్న గ్రామాల సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ సబ్ డివిజన్ జైనథ్ ఏడీఈ శ్రావణ్‌కుమార్, ఏఈలు సంతోష్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ నుంచి బేల వరకు ఉన్న 33 కేవీలైన్ మార్గమాధ్యన లాండసాంగ్వి శివారులోని బొంగు చెట్ల కొమ్మలు తొలగించడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

జైనథ్: మండల కేంద్రంలో శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శనివారం అనంత చతుర్థి సందర్భంగా భక్తులు లక్ష వత్తుల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో అనంతపద్మనాభ స్వామి కొలువై ఉండడంతో ప్రతీ ఏడాది అనంత చతుర్థి రోజు ఈ కార్యక్రమం చేపడుతారు. కుటుంబసభ్యులు సుఖ సంతోషాలతో ఉండాలని దంపతులు పూజలు చేస్తారు.

వేధిస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: మహిళలు, యువతులు, బాలికలు వేధిస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సఖీ కేంద్రం సిబ్బంది సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు పోక్సో చట్టం, సఖీ సేవల గురించి వివరించారు. లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకే పోక్సో చట్టం ఉందన్నారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

పశువైద్యశాలకు త్వరలో రెగ్యులర్ వైద్యులు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని పశువైద్యశాలకు త్వరలో రెగ్యులర్ వైద్యులు రానున్నట్లు ఏబీవీపీ విచార్ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ అన్నారు. శనివారం పశువైద్యాశాలను సందర్శించారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం, నాయకులు భవనం నిర్వహణను నిర్లక్ష్యం చేయడంతో శిథిలావస్థకు చేరిందన్నారు. రెగ్యులర్ డాక్టర్ లేకపోవడాన్ని గమనించి, జిల్లా ఆఫీసర్ రామారావుతో ఫోన్‌లో మాట్లాడారు. దీనికి స్పందించిన రామారావు, త్వరలోనే ఒక వెటర్నరీ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు గాజుల పోతన్న, రమేశ్ బత్తుల, చెట్ల పెల్లి అనిల్, పోశెట్టి, జూంగాల భోజన్న, వినోద్, అమృత్‌రావు, సుదర్శన్, మహేందర్, జాకేశ్ పాల్గొన్నారు.

కష్టకాలంలో అండగా బాల్య స్నేహితులు

భీంపూర్: మండలంలోని ధన్నోర గ్రామానికి చెందిన మంత్రి మహేందర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న బాల్య స్నేహితులు ఆయనను శనివారం పరామర్శించారు. తమవంతుగా రూ. 26 వేల ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. ధైర్యంగా ఉండమని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మార్శెట్టి అనిల్, రవీందర్, జయసారథి, షేక్ మహమ్మద్ రఫీ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీకి నిధులు కేటాయించండి

బోథ్: వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని బోథ్ మండలంలోని సాయినగర్ కాలనీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి శనివారం కలెక్టర్ రాజార్షి షాను కలిసి విన్నవించారు. కాలనీవాసుల సమస్యలను కలెక్టర్‌కు వివరించిన ఆమె, వరదలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సమస్యను పరిష్కారానికి ఎగువ భాగంలో రూ. 50 లక్షలతో వరద కాలువ నిర్మించాలని కోరారు. అలాగే సైడ్ డ్రైయిన్‌ల కోసం రూ. 25 లక్షలు, కల్వర్టుల నిర్మాణం కోసం మరో రూ. 25 లక్షలు మంజూరు చేయాలన్నారు. పేదలకు 50 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని విన్నవించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

నేరడిగొండ: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు హెచ్ఈఓ పవార్ రవీంపీంవీందర్ అన్నారు. శనివారం మండలంలోని పీచర, గోవిందాపూర్, నాగమల్యాల్ గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే వైద్య శిబిరాలు నిర్వహించారు. మొత్తం 65 మందికి పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి జ్వరం ఉన్నట్లు నిర్ధారించారు. మరో ఇద్దరికి విరోచనాలు ఉండగా, వైద్యం అందించారు. నలుగురు గర్భిణీలకు పరీక్షలు నిర్వహించగా, ఓ నిండు గర్భిణీకి 7.5 గ్రాములు మాత్రమే హిమోగ్లోబిన్ ఉండడంతో హైరిస్క్ కేసుగా గుర్తించి ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, సుమలత, ఏఎన్ఎం కల్పన, ఆశా వర్కర్ కినాక కౌశల్య పాల్గొన్నారు.

రైతులకు వాగు కష్టాలు..!

- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సిందే
- సకాలంలో పనులు కాక.. తగ్గుతున్న దిగుబడి


వాగు దాటుతున్న రైతులు

సాత్నాల: భోరజ్ మండలం పెండల్వాడ రైతులు సాగు పనులు ప్రారంభించాలంటే, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సిన పరిస్థితి. గ్రామానికి సాత్నాల వాగు అవతల 1500 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మధ్యలో ప్రవహించే వాగు వారికి పనులకు అడ్డంకిగా మారింది. దీంతో రైతులు పొలాల్లో పనులు చేసేందుకు ఉదయం, సాయంత్రం వాగు కష్టాలు తప్పడం లేదు. భారీ వర్షాల కారణంగా వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అప్పడప్పుడు పలు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. పలుమార్లు వాగులో కొట్టుకుపోయిన ఘటనలు జరగడం రైతుల ఆందోళన చెందుతున్నారు. ఎరువులు, కూలీలను పంట పొలాలకు తీసుకెళ్లడానికి తిప్పలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లుగా వాగుపై వంతెన నిర్మించలేదు. ప్రతీ పంట కాలంలో మాకు ఇదే సమస్య అని వాపోతున్నారు. ప్రతీ ఏటా సమస్యను నాయకుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పరిష్కారం కావడం లేదని ఆరోపిస్తున్నారు. వంతెన నిర్మిస్తే కౌట, లేఖర్ వాడ, సాంగ్వి, బాలాపూర్ వాహనదారులకు మహారాష్ట్ర వెళ్లేందుకు దూర భారం తగ్గుతుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగు కష్టాలు తీర్చాలని రైతులు వేడుకుంటున్నారు.

పట్టించుకోవడం లేదు



25 సంవత్సరాలుగా ఇబ్బంది పడుతూనే ఉన్నాం. పంట సాగు చేయాలంటే వాగు దాటక తప్పదు. వాగు ఉప్పొంగి ప్రవహిస్తే ప్రాణాలను పణంగా పెట్టి వెళ్తున్నాం. ఎన్నిసార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడం లేదు. ఇకనైనా బ్రిడ్జి నిర్మాణం చేపట్టి సమస్యను దూరం చేయాలి.

– ఎల్టి అశోక్ రెడ్డి, గ్రామస్తులు

వంతెన నిర్మించాలి



ప్రతిసారి వర్షాలు పడితే వాగు ఉప్పొంగుతుంది. పశువులను కూడా వాగు దాటించడం చాలా కష్టం అవుతుంది. ఎప్పుడైనా ప్రమాదం జరగని భయం మాకు ఉంది. వ్యవసాయం తప్పా.. మాకు మరో ప్రపంచం లేదు. వంతెన కడితేనే మా గ్రామానికి ఊరట లభిస్తుంది.

– బెర సుదర్శన్, పెండల్‌వాడ

‘కంది’ క్యాంపు ఆఫీస్‌ను సందర్శించిన మంత్రి


కందితో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఆదిలాబాద్: తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క శనివారం ఆదిలాబాద్‌కు వచ్చారు. మహారాష్ట్రలోని వార్ధాలో గల సేవాగ్రామ్ సందర్శనకు వెళ్తూ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చారిజ కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఆమెకు పార్టీ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. జిల్లా రాజకీయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, స్థానిక ఎన్నికలు వంటి అంశాలపై ఇరువురు కాసేపు చర్చించారు. అనంతరం ఆమెతో పాటు కంది శ్రీనివాస రెడ్డి, జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ కూడా వార్ధా బయలుదేరి వెళ్లారు.

మీనాక్షి నటరాజన్‌ను కలిసిన ‘కంది’

కైలాస్‌నగర్: కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను ఆ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహారాష్ట్రలోని వార్ధాలో గల సేవాగ్రామ్‌లో కలిసిన ఆయన నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని వివరించినట్లు తెలిపారు.

విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


ప్రశాంస పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులతో పీవో, ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం కుమురం భీం కాంప్లెక్స్‌లోని పీఎంఆర్‌సీ హాల్‌లో ఏర్పాటు చేసిన గురు పూజోత్సవానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి హాజరయ్యారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ఏ రంగంలోనైనా రాణించేందుకు గురువు అవసరమన్నారు. ఉపాధ్యాయులు వారి గురుతర బాధ్యతను నిర్వర్తించి దేశానికి మంచి పౌరులను అందించాలని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తరగతి గది దేశ భవిష్యత్ నిర్మాణంలో ప్రాముఖ్యత కలిగి ఉంటుందన్నారు. ప్రభుత్వం పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాల ఆశ్రమ పాఠశాలలలో ఉత్తమ సేవలు అందించిన 64 మంది ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమ శాఖల ఉపసంచాలకులు అంబాజీ, రమాదేవి, జనార్దన్, అగస్టీన్, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

వెళ్లిరా.. వినాయకా..


తలమడుగు: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే


ఇచ్చోడ: భజన కీర్తనలతో శోభాయాత్ర

ఇచ్చోడ: మండల కేంద్రంలో వినాయక నిమజ్జన శోభాయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్ర చేపట్టారు. మండల కేంద్రంలో సమీపంలో ఉన్న ఎల్లమ్మకుంట చెరువులో నిమజ్జనం చేశారు. ముఖరా(కె)లో వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు భజన, సంకీర్తనలతో శోభాయాత్ర చేపట్టారు.

బేల: మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో శనివారం గణేశ్ నిమజ్జనం శోభాయాత్రను గణేష్ మండలిల సభ్యులు ఘనంగా నిర్వహించారు. పలు గణేశ్ మండలి సభ్యులు భజన, కీర్తనల మధ్యన ఆయా భజన బృందాలతో శోభాయాత్ర చేపట్టి అందరిని ఆకట్టుకున్నారు.

నార్నూర్: నార్నూర్, గాదిగూడ మండలంలో గణేశ్ నిమజ్జన ఉత్సవాలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి భక్తులు మొక్కులు సమర్పించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో శనివారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర చేపట్టారు. లడ్డు వేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన అశోక్ రూ. 36 వేలకు దక్కించుకన్నాడు. అనంతరం గ్రామస్తులు డప్పుచప్పులు, మహిళల మంగళ హారతులతో శోభాయాత్ర నిర్వహించారు.

తలమడుగు: మండలంలోని పల్లి(బి) గ్రామంలోని గణేశ్ మండపాన్ని శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శబరిమాత ఆశ్రమాన్ని సందర్శించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. మండపానికి విచ్చేసిన ఎమ్మెల్యే యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు.


తాంసి: కప్పర్లలో తరలిస్తున్న గ్రామస్తులు


నార్నూర్: అదర్శనగర్‌లో..


బేలలో..

మెరుగైన వైద్యసేవలు అందించాలి


రికార్డులు పరిశీలిస్తున్న మనోహర్

భీంపూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా అదనపు వైద్యాధికారి మెస్రం మనోహర్ వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం సందర్శించారు. రికార్డు, రిజిస్టర్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్, వైద్య విస్తరణాధికారి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు మేఘ, సహాయకులు శ్రీకాంత్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి


క్షీరాభిషేకం చేస్తున్న సభ్యులు

బోథ్: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని మండల కేంద్రంలోని కుమురం భీం విగ్రహం వద్ద రాజ్‌గోండ్ సేవా సమితి ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన సోయం బాపూరావు, తెల్లం వెంకటరావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అక్రమంగా ఎస్టీ సర్టిఫికెట్లు పొంది ఆదివాసీల ఉద్యోగాలు, విద్య, వైద్యం, భూములను దోచుకుంటున్నారని ఆరోపించారు. వలస లంబాడాలు ఎస్టీలు కారని అన్నారు. న్యాయపరంగా సుప్రీంకోర్టుకు వెళ్తున్న ఆదివాసీ నాయకులను లంబాడాలు బెదిరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు దుర్వ విశ్వేశ్వర్ రావు, కనక అమత్ రావు, ఆడేం భీంరావు, మాడవి గంగారాం, గోడం రమేశ్, తొడసం నీలకాంత్, ఆత్రం దేవరావు, ఆత్రం మోహన్, పంద్రం సోనేరావు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి


వంట గదిని పరిశీలిస్తున్న వైద్యులు సర్పరాజ్

ఇంద్రవెల్లి: ఆశ్రమ వసతి గృహాల్లో చదువుతు న్న విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని జీసీడీవో ఛాయాదేవి అన్నారు. శని వారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల పనితీరు, సమయపాలన వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదికి వెళ్లి విద్యార్థులకు పాటలు బోధించారు. అనంతరం స్టోర్ రూం, వంట గదిని పరిశీలించారు. మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనం అందించాలన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అత్యవసర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో బ్రహ్మానందం రెడ్డి మట్లాడుతూ.. వినాయక నిమజ్జనంలో గాయపడిన వారు అస్వస్థకు గురైన వారికి వెంటనే వైద్యం అందించేందుకు వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో పీహెచ్ఎన్ రాజుబాయి, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, సూభాష్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి సర్పరాజ్ అన్నారు. శని వారం మండలంలోని మామిడిగూడ సబ్‌సెంటర్ పరిధిలోని వాన్వాట్ ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. పలువురు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం వంటగదిని పరిశీలించారు. వైద్య సిబ్బంది సుభాష్, ఇందుభాయి, ప్రేంసింగ్ పాల్గొన్నారు.

ఉచితంగా కంటి పరీక్షలు

బేల: మండలంలోని సాంగిడి గ్రామంలోని శ్రీ మోతిజీ మహరాజ్ ఆలయ ప్రాంగణంలో శనివారం యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి చొరవతో ఎల్‌వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి వైద్యులు ప్రణయ్, వెంకట్, రమణ, సాయిలు కంటి పరీక్షలు చేశారు. శిబిరంలో గ్రామస్తులు దయాకర్ పటేల్, మేకల జితేందర్, మంచికంటి సాయి, దేవన్న, జగదీష్, రాంరెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి


పాఠాలు బోధిస్తున్న ఎంఈవో ఆశన్న

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు నాణ్యమైన విద్యనందించాలని ఉట్నూర్ ఎంఈవో ఆశన్న అ న్నారు. శనివారం మండలంలోని ఎంపీపీఎస్ లక్కారం, ఎంపీపీఎస్ లక్కారం ఎస్సీ కాలనీ, ఎంపీపీఎస్ గంగన్నపేట్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో చేరిన ప్రతీ విద్యార్థి యుడైస్‌లో ఉండాలని ఆదేశించారు. అదేవి ధ ంగా యుడైస్‌లో ఉన్న విద్యార్థులు ఎఫ్ఆర్ఎ స్ రిజిస్ట్రేషన్ చేయాలని, ఏదైనా సమస్య ఉంటే స ంబంధిత సీఆర్పీ లేదా ఎంఐఎస్‌తో కోఆర్డినేష న్ చేసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


బేల: ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు


తాంసి: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


ఇచ్చోడ: నివాళులర్పిస్తున్న సిబ్బంది

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. బేల మండలంలోని సాంగిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. సొనాల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఓస శ్రీనివాస్, పి. ప్రతాప్‌లను ఏబీవీపీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ ఘనంగా సత్కరించారు. తలమడుగు మండలంలో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కజ్జర్ల, తలమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాంసి మండల కేంద్రంలోని పాఠశాలతో పాటు పొన్నారి, కప్పర్ల, గిరిగాం, పొన్నారి ప్రాథమిక పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంద్రవెల్లి మండలంలోని ఎమాయికుంట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బుక గంగయ్యకు రాష్ట్ర ఉత్తమ అవార్డు రావడంతో శనివారం గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాత్ముల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పత్తి పంట ధ్వంసం

తాంసి: మండలంలోని పాలోది గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన విశ్వనాథ్ రైతు పత్తి పంటను శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. రైతు మూడు ఎకరాల్లో పత్తి, ఎకరంలో మొక్కజొన్న పంట వేశాడు. కాగా శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చేనులోకి వచ్చి అర ఎకరానికి పైగా పత్తి పంటను ధ్వంసం చేశారు. రూ.50 వేల నష్టం వచ్చిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవానలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఓటరు జాబితా ప్రదర్శన


జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీవో సత్యనంద్


ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీవో

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కా ర్యాలయంలో శనివారం ఎంపీడీవో సత్యనంద్ ఓటరు జాబితా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎంపీటీసీ ఎన్నికల కోసం ఓటరు జాబితా ప్రదర్శించినట్లు తెలిపారు. మార్పులు, చేర్పులతో పాటు అభ్యంతరాలు ఉంటే ఈనెల 6, 7, 8వ తేదీల్లో మండల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాంసి: మండలంలోని ఆయా గ్రామాల వారీగా ఓటరు జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో శనివారం తాంసి ఎంపీడీవో మోహన్ రెడ్డి ప్రదర్శించారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వారీగా సిద్ధం చేసిన ఓటరు జాబితాను విడుదల చేశారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సతీష్, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండలో..

నేరడిగొండ: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ల, పోలింగ్‌స్టేషన్ల జాబితాను శనివారం నేరడిగొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో లక్ష్మణ్‌లు ప్రదర్శించారు. గ్రామస్తులు, ఓటర్లు తమ పేర్లు సరిగా ఉన్నాయా? లేదా? అని పరిశీలించుకునేందుకు అవకాశం కల్పించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

బీజేపీ సంబురాలు చేసుకోవడం హాస్యాస్పదం


మాట్లాడుతున్న బొడ్డు గంగారెడ్డి

బోథ్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందని బీజేపీ నాయకులు సంబురాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్‌లు అన్నారు. శనివారం మార్కెట్ కార్యాలయంలో మాట్లాడారు. జీఎస్టీని పెంచి ప్రజలపై భారం మోపింది బీజేపీ ప్రభుత్వమేనని, ఇప్పుడు వారే తగ్గించి ఏదో ఘన కార్యం చేసినట్లుగా వ్యవహరించడం సరికాదన్నారు. బీజేపీకి ప్రజలపై ప్రేమ ఉంటే జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్ షేక్ అబుద్, మేరుగు నర్సింహ దాస్, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.